ప్రజాశక్తి
శనివారం 20 జులై 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఫేక్ ప్రచారానికి అంబాసిడర్ జగన్‌రెడ్డి



మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

ఫేక్ ప్రచారానికి అంబాసిడర్‌గా వైఎస్.జగన్‌రెడ్డి ఉన్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. వ్యక్తి గత కక్షలతో జరిగిన హత్యను టిడిపికి ఆపాదించడం సిగ్గు చేటన్నారు. వెలగపూడి సెక్రటేరియట్ నుంచి మంత్రి బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా జగన్ మాత్రం తన బుద్ధి మార్చుకోలేదన్నారు. సొంత బాబాయిని చంపి.. 'నారాసుర రక్త చరిత్ర' అంటూ టిడిపిపై తప్పుడు ప్రచారం చేసిన నీచచరిత్ర జగన్‌ది అన్నారు. వినుకొండలో జరిగిన హత్యకు ముఖ్య కారకుడు జగనే అని తెలిపారు. వైసిపి హయాంలో హతుడు రషీద్, నిందితుడు జిలానీ మధ్య జరిగిన గొడవలపై నాడే చర్యలు తీసుకొని ఉంటే నేడు ఈ హత్య జరిగేదా.? అని ప్రశ్నించారు. నాడు జగన్ చేసిన పాపానికి మూల్యం ఒక నిండు ప్రాణం పోయిందన్నారు. వైసిపి హయాంలో జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని చెప్పారు. నాడు ప్రతిపక్ష నేతల్ని బయట తిరగకుండా అడ్డుకున్న పిరికిపంద జగన్ అని అన్నారు. జగన్ ఇకనైనా శవ రాజకీయాలు మాను కోవాలన్నారు. లేదంటే ప్రజలే జగన్‌ని శాశ్వతంగా రాజకీయాలు మానిపిస్తారని హితవు పలికారు.



లంక గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

వరద వస్తే సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలి

▲ 8లో

ఆక్వా పార్కు పనులు

ముందుకు సాగేనా.?

- శంకుస్థాపనకే పరిమితమైన వైనం..
- నూతన ప్రభుత్వంపై రైతుల ఆశలు
- పార్కుకు మంజూరయిన నిధులు రూ.189 కోట్లు
- సేకరించాల్సిన భూమి 292 ఎకరాలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం చేపట్టిన పథకాల్లో భాగంగా ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన ద్వారా మన రాష్ట్రానికి రూ.189 కోట్ల అంచనాలతో ఆక్వా పార్కును రెండేళ్ల క్రితం మంజూరు చేశారు. ఇందుకోసం మొదటి విడతగా రూ.84 కోట్ల నిధులను కూడా విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పార్కు కోసం 40 శాతం నిధులను కేటాయించాల్సి ఉంది. రాష్ట్రానికి మంజూరయిన ఈ ఆక్వాపార్కును బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం మండలం దిండి వద్ద 292 ఎకరాల్లో నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. గతేడాది మే నెలలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ నిజాంపట్నం వచ్చిన సందర్భంలో ఆక్వా పార్కుకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన అయితే చేశారు గానీ ఇందుకు కావలసిన స్థల సేకరణలో విపరీత జాప్యం నెలకొంది. రాష్ట ప్రభుత్వ వాటాధనం విడుదల కాలేదు. స్థల సేకరణ జరగలేదు. ఆక్వాపార్కు నిర్మాణం అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అధికారులు ఈ ఆక్వా పార్కు పై దృష్టి పెట్టారు. స్థల సేకరణ కోసం కసరత్తు ప్రారంభించారు. కేంద్ర నిధులు కూడా విడుదల అయిన క్రమంలో త్వరితంగా పనులు చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు.



ఆక్వా పార్కు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి (ఫైల్)

సముద్రజలాలు వెనక్కు వెళ్లడంతో..

నిజాంపట్నం సమీపంలోని దిండి గ్రామం వద్ద సముద్రం ఒంపుగా ఉన్న నేపథ్యంలో ఇక్కడ సముద్ర జలాలు వెనక్కు వెళ్ళిన కారణంగా ఈ ప్రాంతంలో వందల ఎకరాల భూములు బయట పడ్డాయి. ఈ భూముల్లో 300 ఎకరాలను ఆక్వా పార్కు సముదాయం కోసం సేకరించనున్నారు. ఇప్పటికే అక్కడ మడ అడవులు విస్తరించిన క్రమంలో 50 ఎకరాలలో మడ భూములను అలానే ఉంచనున్నారు. మరో 50 ఎకరాల భూమిని టూరిజం కోసం కేటాయిస్తున్నారు. 192 ఎకరాల్లో ఆక్వా పార్కు ద్వారా పీతలు, పండుగప్పలు, రొయ్యల హేచరీలు, సముద్ర ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్ కేంద్రం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. ఇటీవలనే జిల్లా కలెక్టర్‌గా వచ్చిన జె వెంకటమురళి ఆక్వా పార్కుపై సమీక్షతో పాటు దిండి ప్రాంతంలో క్షేత్ర పర్యటన చేశారు. సముద్రం నుంచి ఏర్పడిన నూతన భూభాగానికి సర్వేనెంబర్ కేటాయిస్తూ ఉత్తర్వులతో జీవో తేవడంతో పాటు, సదరు భూమి కేటాయింపులకు సిసిఎల్ఏ నుంచి అనుమతులు వచ్చేలా పనులు వేగవంతం చేశారు. దేశంలో అత్యాధునిక పరిజ్ఞానంతో రూపొందించే మొదటి ప్రాజెక్టుగా ప్రాచుర్యం ▶ 2లో

సాఫ్ట్‌వేర్ రంగం నేలచూపు



- రెండేళ్లుగా బాగా తగ్గిన ఉద్యోగాలు
- ఎంపిక చేసి వెయిటింగ్‌లో పెడుతున్న కంపెనీలు
- కొత్త ప్రభుత్వంపై నిరుద్యోగ యువకుల బోలెడు ఆశలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కరోనా వల్ల ఇళ్ల వద్ద నుంచే ఐటీ ఉద్యోగాలు చేశారు. కంపెనీలకు పోకుండా ఇంట్లో ఉండే పనిచేశారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కరోనా తర్వాత సాఫ్ట్‌వేర్ రంగం కుదేలైంది. కారణాలనేకం చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. భవిష్యత్‌పైనా స్పష్టత లేదు. ఐటీ రంగం నేలచూపు చూస్తోంది. ఈ రంగంలో ఉద్యోగాలు భారీగా కోతపడ్డాయి. మరోవైపు అమెరికాలోనే ఉద్యోగాలు పోతున్నాయనే చర్చ రోజూ వింటున్నాం. ఇక్కడ మధ్యతరగతి కుటుంబాల నుంచి ఇంజనీరింగ్ పూర్తయ్యాక ఎంఎస్ కోసం అమెరికా వెళుతుంటారు. ఇలా వెళ్లే వారి సంఖ్య కూడా పడిపోయింది. అక్కడ పరిస్థితులు బాగా లేవని వెనక్కు తగ్గుతున్నారు. ఇక ఇక్కడ పరిస్థితి చూసినా అలాగే ఉంది.

పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రాజెక్టులు లేవనే సాకుతో ఉద్యోగులను తగ్గిస్తున్నారు. కొత్తగా ఎవరినీ తీసుకోవడం లేదు. కాలేజీల్లో ప్లేస్‌మెంటు పేరుతో కొందరిని ఎంపిక చేసుకుంటున్నారు. వారికి అపాయింట్‌మెంటు లేఖలు ఇస్తున్నారు. కంపెనీలకు పిలవడం లేదు. వెయిటింగులో పెడుతున్నారు. ప్రాజెక్టులు రాగానే పిలుస్తామంటున్నారు. దీంతో ఇంజనీరింగ్ పూర్తి చేసి రెండేళ్లుగా ఇళ్ల వద్దే ఉంటున్నారు. ఖాళీగా తిరుగుతున్నారు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులున్నారు. కంపెనీలు ఎప్పుడు పిలుస్తాయా? అని ఎదురుచూస్తున్నారు. బెంగుళూరు, చెన్నయ్, హైదరాబాద్‌లోని పలు ఐటీ దిగ్గజాలే నియామకాల విషయంలో సందిగ్ధంలో పడ్డాయి. పేరున్న కంపెనీలు అన్నీ సంక్షోభంలో ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం పాతిక వేల ఉద్యోగం వచ్చినా చాలనే పరిస్థితి వచ్చింది. ఎన్నికలు సమయం కావడంతో కొందరు కాల్‌సెంటర్లలో చేరిపోయారు. అభ్యర్థులకు ప్రచారం పనులు చేశారు. ఓటర్లకు ఫోన్లు చేసి పార్టీల సమాచారం చేరవేశారు. ఎన్నికల పర్వం ముగియడంతో ఇవి కూడా ఇప్పుడు తగ్గిపోయాయంటున్నారు. వాస్తవానికి ఇవి నాన్ టెక్నికల్ ఉద్యోగాలు. సాఫ్ట్‌వేర్ చదివిన యువకులు కూడా ప్రస్తుత పరిస్థితులను గమనించి ఇలాంటి ఉద్యోగాల్లోనూ చేరారు. ఇవి కూడా చాలా మందికి రానందున ఖాళీగా తిరుగుతున్నారు. జిల్లాలో ఉన్న ఇంజనీరింగు కాలేజీలు గానీ, బయట యూనివర్శిటీల్లో చదివే విద్యార్థులు గానీ ఏటా జిల్లా నుంచే 30 వేల మంది బిటెక్ చేస్తున్నారు. వీరిలో కనీసం 10 శాతం మందికే ఉద్యోగాలు వస్తున్నాయి. వారిలో ఎంత మందిని పిలుస్తున్నారనేదీ స్పష్టత లేదు. ఇతర సాధారణ డిగ్రీలు చదివిన విద్యార్థులకు అసలు ఉద్యోగాలే కనిపించడం లేదు. బీఈడి, టిటిసీ పూర్తిచేసిన వాళ్లు ఇప్పుడు డిఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. ఇవి కూడా 700లోపే పోస్టులున్నాయి. వీటి కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు వేలల్లో ఉన్నారు. ఇక్కడా అయోమయమే.. సాధారణ డిగ్రీ చేసిన వాళ్లంతా మాల్స్‌లో రూ.పది వేలకే పనిచేస్తున్నారు. ఆసుపత్రులు, దుకాణాలు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు సేల్స్ ఏజంట్లుగానూ పనిచేస్తున్నారు. ఫైనాన్సు కంపెనీల్లో వసూళ్లకు పోతున్నారు. గ్రానైట్ ▶ 2లో

పొదిలిలో స్వల్ప భూకంపం..

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలో శుక్రవారం ఉదయం స్వల్పంగా భూమి కనిపించింది. ఉదయం 6:25 గంటల ప్రాంతంలో ఎక్కడో పెద్ద శబ్దం వచ్చింది. ప్రజలంతా ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ పేలిందేమో అనుకున్నారు. అదే సమయంలో భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. రెండు సెకండ్ల పాటు భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. దీని వల్ల పట్టణంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభ వించలేదు. పొదిలి పట్టణంలో సరైన నీటి వనరులు లేక భూకంపాలు సంభవిస్తున్నాయని డాక్టర్ షేక్ ఇమాంసా తెలిపారు. గతంలో కూడా ఇలా స్వల్పంగా భూమి కంపించిందని గుర్తు చేశారు.

'ఉపాధి' కూలీల

బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్
- 22న నిరసన కార్యక్రమాలకు పిలుపు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

గత రెండు నెలలకు పైగా ఉపాధి హామీ కూలీలు చేసిన పనులకు వేతనాలు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. బకాయిల విడుదల కోసం ఈ నెల 22న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలని, ఈనెల 23న కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్లో ఉపాధికి నిధులు పెంచాలని కోరుతూ చేపట్టిన ▶ 2లో

బకాయిలు వెంటనే విడుదల చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నిరసన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆ సంఘం జిల్లా సీనియర్ నాయకులు జాల అంజయ్య, జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు తో కలిసి కంకణాల ఆంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా ఉపాధి హామీ చట్టం వచ్చిందని గుర్తు చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిత్యం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతున్నదని, దాన్ని కాపాడుకునేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలు పనిచేసిన రెండు వారాలకు ఒకసారి డబ్బులు ఇవ్వాలని, వేతనాలు ఇవ్వడం ఆలస్యం అయితే వడ్డీతో కూడా కలిపి ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని అన్నారు. కాబట్టి గత 12 వారాలుగా ఆగిపోయిన వేతనాలకు వడ్డీతో కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలు పని అడిగిన 15 రోజులలోపు పని చూపించాలని, లేనిపక్షంలో వారికి నిరుద్యోగ భతి ఇవ్వాలని చట్టం చెబుతున్నా, దాన్ని ప్రభుత్వాలు దిక్కరిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వాలే చట్టాలను ధిక్కరించటం అమానుషమని అన్నారు. జూన్ 5వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు ఆగిపోయాయని, ఇప్పటికీ అరకొరగానే జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరం జిల్లాలో మే, జూన్, జూలై మాసాలలో రెండు లక్షల మందికి పైగా కూలీలు పనిచేస్తుండే వారిని తెలిపారు. వ్యవసాయ పనులు లేని కాలంలో లక్షలాదిమందికి ఈ చట్టం పనులు కల్పించేదని అన్నారు. సుమారు 45 రోజులుగా పనులు చూపకుండా పేదల కడుపు మాడ్చే విధంగా వ్యవహరించటం దుర్మార్గమని అన్నారు. పనైనా చూపాలి లేదా నిరుద్యోగ భతి అయిన తక్షణం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 23వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న బడ్జెట్లో ఉపాధి హామీ చట్టానికి రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పుల ఫలితంగా పని దినాలు కుదించబడుతున్నాయని, పనులు లేక పట్టణ ప్రాంతాలకు వలస వచ్చిన అక్కడ ఎటువంటి పనులు దొరకక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో పేదల కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా దేశ ఆర్థిక సంక్షోభాన్ని నివారించవచ్చని, పేదరికం నిర్మూలించవచ్చని అనేకమంది మేధావులు చెబుతున్నటువంటి సూచనలను కేంద్ర ప్రభుత్వం తలకెక్కించుకోవాలని వారు కోరారు. ఉపాధి హామీకి తగిన విధంగా నిధులు కేటాయించకపోతే పేదలను కదిలించి ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ నెల 22వ తేదీన బకాయిల విడుదల కోసం, ఉపాధి హామీ పనులు చూపాలని, బడ్జెట్లో నిధులు పెంచాలని జరిగే నిరసన కార్యక్రమాలలో ప్రజలు విరివిగా పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆక్వా పార్కు పనుల ముందుకు సాగేనా.?

(మొదటిపేజీ తరువాయి)

పొందనున్న ఆక్వా పార్క్ ద్వారా సముద్రంలోనే దొరికే సివిడ్స్ ఇక్కడ ఉత్పత్తి చేస్తారు. రాష్టంలోని ఆక్వా రైతులు ఎప్పటి నుంచో వనామి వంటి రొయ్యల సేద్యం చేస్తున్నారు. రానున్న కాలంలో వనామికి ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా ఇతర చేపలు, రొయ్యలు ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రూపొందించనున్నారు. పండుగప్ప, అరుదైన జాతి పీతల పెంపకం, వివిధ రకాల జాతుల మత్స్య సంపద ఉత్పత్తులు, ఎగుమతులకు కేంద్రంగా ఆక్వా పార్కు నిర్మాణం జరగాల్సి ఉంది. దీంతో పాటు సముద్రంలో లభించే అరుదైన రంగు చేపలను అలంకరణల కోసం ఉత్పత్తి చేసే ప్రక్రియ ఈ పార్కులో జరగనుంది. ఆక్వా టూరిజం అభివద్ధి పనులు చేపట్టాల్సి ఉంది.

గణనీయంగా పెరగనున్న ఆక్వా సాగు

జిల్లాలోని బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం, నిజాంపట్నం, రేపల్లె, నగరం తదితర ప్రాంతాల్లో దాదాపు 25 వేల ఎకరాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. జిల్లాలో వెనామి రకం సాగు అధికంగా ఉంది. స్థానికంగా వెనామి, టైగర్ రొయ్యలు, పీతలు, పండుగప్పల సీడ్‌ను రైతులు తమిళనాడు, పుదుచ్చేరిలకు వెళ్ళి తెచ్చుకుంటున్నారు. ఈ కారణంగా రవాణా వ్యయం పెరిగి రైతులకు అధిక భారం పడుతుంది. అలాగే రొయ్యలు, చేపలు, పీతల పంట చేతికి వచ్చాక రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి ఇక్కడ నుంచి చెన్నై, కృష్ణపట్నం, కాకినాడ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి.. అక్కడ ప్రాసెసింగ్ చేసి ఎగుమతులు చేస్తున్నారు. జిల్లాలోని దిండి ప్రాంతంలో ఆక్వా పార్కు ఏర్పాటు ద్వారా స్థానికంగా సీడ్ దొరకడంతో పాటు, ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. రైతులకు కూడా తక్కువ ధరలు సీడ్ లభిస్తుంది. రైతులకు ఖర్చులు తగ్గుతాయి. పార్కు ఏర్పాటుతో జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రెండేళ్లుగా ఆక్వా రైతులను ఊరిస్తున్న ఆక్వా పార్కు నిర్మాణం పనులను నూతన ప్రభుత్వం త్వరితంగా చేపట్టి పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.



స్కాన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

స్కాన్ సెంటర్లు పరిశీలన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి సూచనల మేరకు మారస్ మీడియా అధికారి డి శ్రీనివాసులు శుక్రవారం ఒంగోలు నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కాన్ సెంటర్ల యాజమాన్యం తప్పకుండా పిఎస్‌పిఎన్ డిటి చట్టం నిబంధనలకు లోబడి నిర్వహించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన స్కాన్ సెంటర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కాన్ సెంటర్ల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను రిసెప్షన్, స్కాన్ రూముల్లో ప్రజలకు కనిపించేలా ఉంచాలని చెప్పారు. రూముల్లో ఎలాంటి దేవుని బొమ్మలు, చిత్రాలు ఉంచరాదని సూచించారు. స్కాన్ రూం బయట లింగనిర్ధాణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం అనే సూచికను తెలుగు, ఇంగ్లీషులలో ప్రదర్శించాలని చెప్పారు. పిసిపిఎన్‌డిటి చట్టంకు సంబంధించిన వివరాలను ప్రజలు చదువుకునేందుకు వీలుగా ఏర్పాటు చేయాలన్నారు. స్కాన్ సెంటర్ల ఐదు సంవత్సరాల రిజిస్ట్రేషన్ కాలం ముగిసే నాటికి ఒక నెలముందు రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప మాస్ మీడియా అధికారి సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ


ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో ఉమెన్ పోలీసు స్టేషన్, టుటూన్ పోలీసు స్టేషన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లను జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లలోని రికార్డులు, ఫిర్యాదులు, రిసెప్షన్ బుక్, జనరల్ డైరీ, పలు రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లలోని గదులు, చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లలో సిబ్బంది ఎంత మంది ఉన్నారు. అదనంగా సిబ్బంది అవసరమా...?మౌళిక సదుపాయాలు, ఇతర సమస్యలమీద వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. పోలీసు స్టేషన్‌లలో ఉన్న ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. స్టేషన్‌లలో నమోదైన వివిధ కేసులను సమీక్షించి, ఆయా కేసుల నమోదు, దర్యాప్తు, పెండింగ్ కేసుల గురించి ఆరాతీశారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, నేర దర్యాప్తులో ప్రత్యేక టీంలుగా ఏర్పడి కేసులు చేదించాలని సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, విజిబుల్ పోలిసింగ్ నిర్వహించాలని, నేరాలు కట్టడి చేయాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే మహిళా ఫిర్యాదు దారులతో మర్యాదగా నడుచుకోవాలని, అంకితభావంతో, మానవతా దృక్పదంతో పనిచేయాలని , పిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మహిళల భద్రత, రక్షణ కోసం పోలీసులు అధికారులు, సిబ్బంది, మహిళా పోలీసులు అహర్నిశలు పనిచేయాలని సూచించారు. స్టేషన్‌లలో వివిధ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధుల పట్ల అంకిత భావంతో ఉంటూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని చెప్పారు. పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకంగా మాట్లాడి ,వారి సమస్యను తెలుసుకొని, వెంటనే విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఎస్పీ సూచించారు. జిల్లా ఎస్పీ వెంట ఎస్‌బి సిఐ రాఘవేంద్ర, టుటూన్ సిఐ జగదీష్, ట్రాఫిక్ సిఐ మాలకొండయ్య, తదితరులు ఉన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ ఎఆర్ దామోదర్

ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ టౌన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి సమీక్షించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికా బద్ధమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. త్రిబుల్ రైడింగ్, డ్రంగ్ అండ్ డ్రెవ్, మోడీపై సైలెన్సర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు.



ప్రశాంత్ కుమార్‌ను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా ప్రశాంత్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాల మండల ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందా ప్రశాంత్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ఉన్నం నారాయణ, ప్రధాన కార్య దర్శిగా మిరియాల రమణ, ట్రెజరర్‌గా రసూల్, కార్యవర్గ సభ్యులుగా కందుల కాశిరెడ్డి, రాజు (బద్రి), శ్రీనివాసులు, మంత్రు నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాఫ్ట్‌వేర్ రంగం నేలచూపు..

(మొదటిపేజీ తరువాయి)

రంగంలో చదువుకున్న యువతకు పనుల్లేవు. అంతా బీహార్, ఒరిస్సా కార్మికులే పనిచేస్తున్నారు. ఉన్నత చదువు చదువుకున్న వారికి ఇక్కడ అవకాశాల్లేవు. ఏదేమైనా ఇప్పుడు ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువత గందరగోళంగా ఉంది. చెడుతిరుగుళ్లకు అలవాటు పడుతున్నారు. రాజకీయ నేతల కుమారుల వెంట కొందరు తిరుగుతూ జీవితాలను పాడు చేసుకుంటున్నారు. కొత్త ప్రభుత్వంపై నిరుద్యోగయువత ఆశలు పెట్టుకున్నారు. చంద్రబాబు వస్తే సాఫ్ట్‌వేర్ రంగం పుంజుకుంటుందనే ప్రచారం పెరిగింది. ఎన్నికల్లో యువకులు అందరూ మూకుమ్మడిగా తెలుగుదేశం అభ్యర్థులకు ఓట్లేశారు. కొత్త ప్రభుత్వంపై బోలెడు ఆశలు పెట్టుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల వద్దకు ఉద్యోగాల కోసం తిరిగేవారి సంఖ్య పెరుగుతోంది. వీరి ఆశలు ఎలా నెరవేరుతాయన్నదీ చూడాలి. సాఫ్ట్‌వేర్ రంగం కుదేలవడంతో గ్రామాల్లోనూ పరిస్థితులు మారిపోయాయి. ఈ రంగంలో ఉపాధిని పెంచే కంపెనీలు రాష్ట్రంలో వచ్చేలా చూడాల్సిన అవసరం ఉంది.



స్మగ్లర్లను అరెస్టు చేసిన పోలీసులు

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలంలో 28 ఎర్రచందనం దుంగలతో పాటు, ఒక కారును స్వాధీనం చేసుకుని ముగ్గురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్థానిక అటవీ సిబ్బంది సహకారంతో గురువారం తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రకాశం జిల్లా కొమరోలు మండలం నల్లగుంట్ల అటవీ బీటు పరిధిలోని అక్కాపల్లి చెరువు సమీపంలో కారు నిలిపి అందులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. టాస్క్‌ఫోర్సు సిబ్బంది చుట్టుముట్టడంతో వాహనం వదిలి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించి పట్టుకోగలిగారు. మొత్తం 28 దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురినీ అరెస్టు చేశారు. వారిని ప్రకాశం జిల్లా ఒంగోలు టౌన్‌కు చెందిన పేరం రామరాజు (44), సంచర్ల పంచాయతీ రామేశ్వరం గ్రామానికి చెందిన రాచకొండ రామయ్య (25), క్రిష్ణంశెట్టి పల్లి మండలం షేక్ ఖాసిం (43)గా గుర్తించారు. పేరం రామరాజు అనే వ్యక్తికి తమిళనాడుకు చెందిన స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తెలిసింది. ఈ కేసును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌లో నమోదు చేయగా, సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న దుంగలు

అధ్వానంగా అంతర్గత రహదారులు

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

మండలంలోని వెంగల్‌రెడ్డిపల్లెలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు చేరి బురదమయంగా మారాయి. ఈ రోడ్లపై చిన్నపిల్లలు, వృద్ధులు నడవటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుండి పొలాలకు వెళ్లే వీధి బురద గుంతగా మారింది. ఈ రహదారిలో వ్యవసాయ ట్రాక్టర్లు, ఆటోలు తిరిగే క్రమంలో ఆ బురద నీరంతా చిమ్మి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ళలో పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది ఇల్లు వదలి వేరొక చోటకు మకాం మారుస్తున్నారు. గ్రామంలో అంతర్గత రహదారులకు ఇరువైపులా సైడ్ కాలువలు నిర్మాణం చేపట్టి మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని సంబంధిత అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.



ఇళ్ల మధ్యలో బురదమయంగా మారిన ప్రధాన రహదారి

ఉసురు తీసిన ఈత సరదా

- ఇద్దరు యువకుల గల్లంతు
- గజ ఈతగాళ్లతో వెతుకులాట
- ఒకరి మృతదేహం లభ్యం, మరొకరి కోసం కొనసాగుతున్న గాలింపు



గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపడుతున్న ఎస్సై పున్నారావు



మృతి చెందిన నలమాలపు నవీన్

ప్రజాశక్తి-టంగుటూరు

సరదాగా ఈత కొట్టడానికి వచ్చి మట్టి గుంతలోకి దిగి ఊపిరాడక ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన టంగుటూరు మండలం వల్లూరు చెఱువు వద్ద గురువారం మధ్యాహ్నం చోటు చేసుకొంది. మండలంలోని వాసేపల్లిపాడు గ్రామానికి చెందిన నలమాలపు నవీన్ (23), బాణాల వెంకటేష్ (22) ఇద్దరు ప్రాణ స్నేహితులు. ఇద్దరూ గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈత కొట్టడానికి వల్లూరమ్మ చెఱువుకు వచ్చారు. చెఱువుకు పడమర వైపు చాలా లోతుగా మట్టి తీసి వుండటం, వారికి లోతు తెలియకపోవడంతో ఈత కోసం దిగి ఊపిరాడక మృతి చెందారు. సాయంత్రమైనా ఇద్దరూ ఇంటికి రాకపోవడంతో, టంగుటూరు పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. స్పందించిన టంగుటూరు ఎస్సై పున్నారావు తన సిబ్బందితో గజఈతగాళ్లతో శుక్రవారం వెతుకులాట ప్రారంభించగా నలమాలపు నవీన్ మృతదేహం లభ్యమైంది. శుక్రవారం సాయంత్రం చీకటి పడేంతవరకు వెతికి చీకట్లో ఏమీ కానరాకపోవడంతో తన సిబ్బందితో వెను దిరిగారు. కాగా నలమాలపు నవీన్ గ్రానైట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఇతని తండ్రి 15 సంవత్సరాల క్రితం చనిపోయారు. తల్లి ఒక్కటే కుటుంభ భారాన్ని మోస్తోంది. బాణాల వెంకటేష్‌కు చిన్నతనంలో తల్లిదండ్రులు చనిపోవడంతో నాయనమ్మ సంరక్షణలో పెరుగుతున్నాడు.



మృతి చెందిన చిన్న సుబ్బయ్య

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు పట్టణ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. అమరావతి-కడప రాష్ట్రీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి లారీ, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన చిన్న సుబ్బయ్య అనే వ్యక్తి గాయపడగా 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



దెబ్బతిన్న వాహనం

ఎదురెదురుగా వాహనాలు ఢీ

ఏడుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీ కొని ఏడుగురికి తీవ్ర గాయాలైన సంఘటన పెద్దదోర్నాల మండలంలోని బోడేనాయక్ తాండా సమీపంలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. బోడే నాయక్ తాండా సమీపంలో శ్రీశైలం నుంచి మహారాష్ట్ర వెళ్తున్న ప్రైవేటు వాహనం, శ్రీశైలం వెళ్లే ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన అప్పారావు, జాక్షనేశ్వర్, వైష్ణవి, కృపాలి దీపక్, సందీప్, ఈశ్వర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయ పడిన వారిని దోర్నాలలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స అందించారు. ఎస్సై అంకమరావు సంఘటనా స్థలానికి చేరుకొని సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

ఏపిడబ్ల్యుజేఎఫ్, ఏపీజేఎఫ్, ఏపిఈజేయు ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మీడియా యాజమాన్యాలపై, విలేకర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలు జర్నలిస్టు యూనియన్ సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం ఏపిడబ్ల్యుజేఎస్, ఏపీజేఎఫ్, ఏపీఈజేయు ఆధ్వర్యంలో ప్రకాశం భవనం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నాకు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు సంఘీభావం తెలియజేశాయి. ధర్నా అనంతరం నిరసన ర్యాలీ చేపట్టి జిల్లా కలెక్టర్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపిడబ్ల్యుజేఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు గొట్టిపాటి నాగేశ్వరరావు, వారధి ఎండి అజయ్ మాట్లాడారు. పత్రికా స్వేచ్ఛను హరించిచేలా ఎవ్వరూ మాట్లాడినా ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపిజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిలీప్; ఏపిఈజేయు రాష్ట్ర నాయకులు మేకపాటి మాల్యాద్రి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు రాజశేఖర్, టివి5 స్టాఫ్ రిపోర్టర్ జనార్ధన్, పి9 ఎండి కిరణ్, ఆర్టీవీ స్టాఫ్ రిపోర్టర్ శ్రీను, ఐన్యూస్ సుధాకర్, సూర్య స్టాఫ్ రిపోర్టర్ ఎం.శ్రీధర్, ఎంసీపి అధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

గిద్దలూరు: గిద్దలూరు పట్టణంలో శుక్రవారం జర్నలిస్టులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజ్యసభ సభ్యుడు, వైసీపీ నాయకుడు విజయసాయిరెడ్డి జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై గిద్దలూరు జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల ఆత్మ గౌరవానికి భంగం కల్పిస్తూ విజయసాయిరెడ్డి వ్యవహరించడం బాధాకరమని అన్నారు. అనంతరం విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డీటీ సుబ్బారావుకు, అర్బన్ సిఐ సోమయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సుల్లో ఆసక్తి పెంపొందించాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సోనీ

ప్రజాశక్తి-తర్లుపాడు

విద్యార్థుల్లో వత్తివిద్యా కోర్సుల్లో ఆసక్తి పెంపొందించేలా, ఆలోచనత్మకంగా, సరళ శైలిలో ప్రస్తుత కాలానుగుణంగా పాఠ్యాంశాలు రూపొందించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని డాక్టర్ సోనీ సూచించారు. మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా, వైద్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన వృత్తి విద్యా కోర్సుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సోనీ మాట్లాడుతూ పిల్లలను బడివైపు మళ్ళించే మంత్రం "వత్తి విద్యా కోర్సు" అని అన్నారు. ఈ కోర్సులు జీవన నైపుణ్యాలు పెంపొందించడమే కాకుండా విద్యార్థులకు శారీరక, మానసిక వృద్ధికి కూడా ఉపయోగపడతాయన్నారు. పాఠశాలల్లో వృత్తి విద్యను బలోపేతం చేయడానికి ఒకేషనల్ ట్రైనర్స్, కోఆర్డినేటర్లు అంకితభావం తో పనిచేయాలని కోరారు. అనంతరం వైద్యురాలు సోని మరియు హెల్త్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మను వృత్తి విద్య కోఆర్డినేటర్ ఎన్.భాగ్య లక్ష్మి, ఎ.ఆదిలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వృత్తి నైపుణ్యాలు, ప్రణాళిక రూపొందించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి సోని



రోటరీ ద్వారా కుట్టు మిషన్ అందిస్తున్న దృశ్యం

కుట్టుమిషన్ బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉన్నం శ్రీనివాసరావు జ్ఞాపకార్థం ఆయన మనుమడు ఆహన్స్, మనుమరాలు రీతూష సౌజన్యంతో స్థానిక రోటరీ కార్యాలయంలో స్థానిక కొత్తపేటకు చెందిన పేద మహిళ కొల్లిపర లావణ్యకు కుట్టు మిషన్ శుక్రవారం అందచేశారు. రాజీవ్ కాలనీ ప్రాథమిక పాఠశాలకు 4 కుర్చీలు బహూకరించారు. రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ ఆర్థిక సహాయం చేసిన ఆహన్స్, రీతూషలను అభినందించారు. వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అధికారి ఊటుకూరు ఉమ, అన్నపూర్ణ మాట్లాడుతూ మంచి సేవాలు చేస్తున్న రోటరీ సంస్థను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కరి రామయ్య, రోటరీ కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, పాస్ట్ ప్రెసిడెంట్ చిన్ని మురళీ కృష్ణ, పసుపులేటి ఆంజనేయులు, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, డాక్టర్ దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి పాల్గొన్నారు.



నిత్యవసరాల కౌంటర్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

నిత్యావసరాల విక్రయాలు ప్రారంభం

ప్రజాశక్తి - వేటపాలెం

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయాలు అందుబాటులోకి తెచ్చినట్లు ఎంఎల్ఎ మద్దులూరి మాల కొండయ్య తెలిపారు. స్థానిక పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నందు శుక్రవారం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. బియ్యం కిలో రూ.49, ముడి బియ్యం కిలో రూ.48, దేశ వాలి కందిపప్పు కిలో రూ.160 చొప్పున ఇవ్వ నున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రైస్, దాల్ మిల్లర్ అసోసియేషన్‌ను లాభాల్లో కొంత తగ్గించుకుని తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు ఇవ్వటం అభినందనీయమని అన్నారు. ఎవరైనా ఆధార్ కార్డు చూపించి బియ్యం, కందిపప్పు కొనుగోలు చేయవచ్చని అన్నారు. ఎక్కడైనా అక్రమ నిలువలు, కృత్రిమ కొరత సృష్టిస్తే ఉక్కు పాదం మోపుతానని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దారు పి కృష్ణ కాంత్, ఎన్ఫోర్స్‌మెంట్ డిటీ ఓంకారం, మాజీ సర్పంచులు జంగిలి రామారావు, పులి వెంకటేశ్వర్లు, నాసిక వీరభద్రయ్య, పోగడదండ వెంకటేశ్వర్లు, వేటపాలెం టిడిపి అధ్యక్షుడు జాగాబత్తుని పోతురాజు, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

21న రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 21న స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో జరుగుతుందని రోటరీ క్యాంప్ ఇంచార్జి చిలుకూరి వీరరాఘవయ్య తెలిపారు. క్లబ్ అధ్యక్షులుగా షేక్ కాలేషావలి, కార్యదర్శిగా డాక్టర్ బత్తుల వీరనారాయణ, కోశాధికారిగా జాగర్లమూడి సుబ్బారావు (జెకెసి) ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ శాసన సభ్యులు బాచిన చెంచు గరటయ్య, డిస్ట్రిక్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ ఎస్‌వి రాంప్రసాద్, గవర్నర్ అపాయింట్మెంట్స్ ఛైర్మన్ కొల్లా సింగారావు, అసిస్టెంట్ గవర్నర్ తెళ్ల రమేష్ చంద్రతో పాటు, ఇప్పటివరకు రోటరీ అధ్యక్షుడుగా పనిచేసిన కరణం హనుమంతరావు పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్‌లో విద్యార్థుల సమస్యలు అధ్యయనంలో భాగంగా ఎస్ఎఫ్ఐ బృందం స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలు శుక్రవారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్ శివ శంకర్ మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో హాస్టల్స్‌లో ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అమలవుతున్న మెనూ, హాస్టల్లో పారిశుద్ధ్యం, విద్యుత్తు, మంచినీరు, ఆరోగ్యం వంటి సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. వాతావరణ మార్పుల వల్ల హాస్టళ్లలో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. తక్షణం హాస్టల్స్‌లో మెడికల్ చెకప్‌లు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ అధికారులు హాస్టల్స్ విజిట్ చేసి విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. గురుకుల పాఠశాలలో మంచినీటి ఆర్ఓ ప్లాంట్ రిపేర్ రావడం వల్ల విద్యార్థులకు మంచినీళ్లు అందించడానికి బయట నుండి మినరల్ వాటర్ కొనుగోలు చేయటంతో పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని అన్నారు. వెంటనే మంచినీళ్ల ఆర్వో ప్లాంట్ విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని కోరారు. 2006లో నిర్మాణం చేసిన భవనం అయినప్పటికీ వంటశాల, మరుగుదొడ్లు, భవనంలో కొన్నిచోట్ల పెచ్చులుడుతున్న పరిస్థితి ఉందని అన్నారు. అధికారులు పరిశీలించి భవనంకు అవసరమైన చోట మరమ్మత్తులు చేయాలని కోరారు. భోజనం వండటానికి వంట పాత్రలు కూడా కొత్తవి కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు బి ప్రేమ్ చంద్, టి దేవకినంద్, ఎస్ హర్ష పాల్గొన్నారు.



గురుకుల పాఠశాల్లో పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మోసపోయిన పోస్టల్ ఖాతాదారుల నిరసన

ప్రజాశక్తి - నగరం

మండలంలోని సిరిపూడి పోస్టు ఆఫీసులో డబ్బులు జమచేసి మోసపోయిన ఖాతాదారులకు ప్రతి రూపాయి తిరిగి చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ మణిలాల్ అన్నారు సిరిపూడి పోస్టాఫీస్ వద్ద మోసపోయిన బాధితులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతు సిరిపూడి పోస్ట్ ఆఫీస్ పరిధిలో జరిగినా అధికార యంత్రాంగం సరైన పద్ధతుల్లో స్పందించి బాధితులకు తిరిగి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత 10ఏళ్ల కాలం నుండి ఇక్కడ పోస్ట్ ఆఫీసులో ఉద్యోగి 700 ఖాతాదారులుగా రూ.50లక్షల వరకు డిపాజిట్లు, నెలవారి పొదుపు చెల్లిస్తున్నప్పటికీ వాటిని సక్రమంగా డిపాజిట్ చేయకుండా, ఆన్లైన్ చేయకుండా సొంతానికి వాడుకొంటు అవినీతికి పాల్పడుతుంటే ఎందుకు ఉన్నత స్థాయి అధికారులు సిరిపూడి పోస్ట్ ఆఫీస్ నుంచి జమలు కావడంలేదో సమీక్ష నిర్వహించ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. మోసం చేసినా వ్యక్తి పారిపోక ముందే ఈ వ్యవహారం బయటకు వచ్చినప్పటికీ కొంత మంది డబ్బులు తిరిగి కట్టించి చేతులు దులుపుకున్నారు. జిల్లా స్థాయిలో పోస్టల్ ఉన్నత అధికారులు కానీ, పోలీసులకు గాని కంప్లైంట్ చేయకుండా మౌనంగా ఎందుకు ఉన్నారు. ఇప్పుడు మోసం చేసిన ఉద్యోగి కనపడట్లేదు, డిపార్ట్మెంట్ ఎంక్వయిరీ చేస్తున్నాము అంటూ అతను వస్తేనే డబ్బులు తిరిగి చెల్లిచెంది అన్నట్టు పోస్టల్ అధికారులు వ్యవహరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. బాధితులకు భరోసా కల్పించాలంటే త్వరితగతిన ఎంక్వయిరీ పూర్తి చేయాలని అన్నారు. పేదలు కష్టపడి దాచుకున్న ప్రతి రూపాయి తిరిగి వెనక్కి ఇవ్వాలని కోరారు. అప్పటివరకు సిరిపూడి పోస్టల్ బాధితుల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె రమేష్, మోసపోయిన పోస్టల్ ఖాతాదారులు పాల్గొన్నారు



ధర్నా చేస్తున్న పోస్టల్ ఖాతాదారులు

'నల్లమడ' వరద నివారణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - పర్చూరు

నల్లమడ వరద ముంపు నుండి శాశ్వత పరిష్కారం చూపాలని నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్ కోరారు. నల్లమడ రైతు సంఘం బహిరంగ మండలంలోని చెరుకూరు గ్రామంలో నిర్వహించారు. సభకు పాలేటి వీరయ్య అధ్యక్షత వహించారు. సభలో ప్రొఫెసర్ విజయకుమార్, యార్లగడ్డ అంకమ్మచౌదరి, మానం విజేత, వైవి చౌదరి, కామేపల్లి కృష్ణబాబు, డాక్టర్ కొల్లారాజమోహన్, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, యర్రాకుల వెంకటేశ్వర్లు, దాసరి ఉషారాణి మాట్లాడారు. తరచు నల్లమడ వరదల వలన ముంపుకు గురవుతున్న ప్రాంతానికి శాశ్వత వరద నివారణ కోసం ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసిందని అన్నారు. 2016లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాకుమానులో నల్లమడ వరద నివారణకు నిధులు కేటాయిస్తున్నామని ప్రకటించారని గుర్తు చేశారు. సాకివాగు, చింతలవాగు, యితర వాగులన్నీ పూర్తిగా పూడిపోయాయని తెలిపారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించి కాలపరిమితితో కూడిన ప్రణాళికతో పనులు చేపట్టాలని కోరారు. పంటలకు మద్దతు ధర ప్రకటించినా వ్యాపారులు తక్కువ ధరకే కొంటున్నారని అన్నారు. మద్దతు ధరలకు చట్టబద్ధత చేయాలని కోరారు.



సభలో మాట్లాడుతున్న కొల్లా రాజమోహన్

రైతులు విత్తన నాట్లు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి - పంగులూరు

మధ్య బంగాళా ఖాతంలో ఏర్పడ్డ తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో మండలంలో వివిధ ఖరీఫ్ పంటలకు విత్తనాలు నాటుకునే రైతులు ప్రస్తుతం వాయిదా వేసుకోవాలని ఎఒ కె సుబ్బారెడ్డి సూచించారు. బంగాళా ఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడిందని తెలిపారు. దీనికారణంగా ఆంధ్రప్రదేశ్ తీరం సమీపంగా పయనిస్తూ 24 గంటల్లో ఒడిస్సా రాష్ట్రం చేరే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపిందని అన్నారు. అల్పపీడనం కారణంగా రెండు తెలుగు రాష్ట్రాలకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఒకటి రెండు చోట్ల అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. 19సెంటీ మీటర్లకు మించి వర్ష పాతం నమోదయ్యే అవకాశం ఉందని అన్నారు. అందువలన వాతావరణ శాఖ వరుస హెచ్చరికల నేపథ్యంలో విత్తనాలు నాటుకునే రైతులు వాయిదా వేసుకోవాలని సూచించారు.



ఎఒ కె సుబ్బారెడ్డి



సీఎం చంద్రబాబుకు మొక్కను అందజేస్తున్న కొండయ్య

చంద్రబాబును కలిసిన కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య ఆయన తనయుడు అమర్నాథ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మీడియాతో మాట్లాడారు. టూరిజం డెవలప్మెంట్ గురించి వివరించారు. టెక్స్టైల్ పార్క్ ఎలాట్ చేసి వాటికి సంబంధించిన నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఫిషింగ్ హర్బర్ ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలోని కుందేరు ఆధునీకరణ పనులు, చీరాల నందు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. పంచాయితీలకు 15వ ఫైనాన్స్ నిధులు విడుదల చేయాలని కోరారు. నామినేటెడ్ పదవులు నియోజకవర్గంలో స్థానికులకే ఇవ్వాలని కోరారు. సాగునీటి ఎత్తిపోతల పథకాలకు ఇరిగేషన్ నిధులు విడుదల చేయాలని కోరారు.



పల్లాకు జీడిపప్పు దండతో సజ్జా వెంకటేశ్వర్లు సత్కారం

టిడిపి అధ్యక్షులు పల్లాకు సత్కారం

ప్రజాశక్తి - చీరాల

తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును టిడిపి సీనియర్ నాయకులు సజ్జా వెంకటేశ్వరరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో ఆయనను కలిసి జీడిపప్పు దండతో సత్కరించారు. అనంతరం వివిధ విషయాలు చర్చించారు.



మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు అభివాదం

ప్రజలకు వైఎస్ జగన్ అభివాదం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని అడ్డరోడ్డు జంక్షన్‌లో మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి నుండి వినుకొండలో హత్యకు గురైన వైసీపీ నాయకులు రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతూ మార్గమధ్యలో అడ్డరోడ్డు జంక్షన్‌లో కారు ఆపి కారులోనుండే ప్రజలకు అభివాదం చేశారు. ఆయన పర్యటన విషయం తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఆయన వెంట మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ యేసురత్నం, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు, మాజీ మంత్రి విడదల రజిని పాల్గొన్నారు. ఎస్ఐ పి సురేష్ బందోబస్తు నిర్వహించారు.

ఉపాధి కల్పించాలని నేడు నిరసన

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఉపాధి హామీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పని చూపించాలని, లేదా చట్టప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలనే అంశాలపై జిల్లా వ్యాప్తంగా జరిగే నేడు నిరసన తెలుపుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు తెలిపారు. కొరిసపాడు మండల కార్యాలయం వద్ద జరిగే నిరసనలో ఉపాధి కూలీలు పాల్గొనాలని కోరారు.

అడుగంటిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

- రెండు రోజుల్లో సాగర్‌నీరు వచ్చే అవకాశం

- నీటి పంపింగ్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి-దర్శి

ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన దర్శి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటిమట్టం అడుగు అంటింది. ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ద్వారా దర్శి, ముండ్లమూరు, పొదిలి మండలాల పరిధిలోని 127 గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ మొత్తం కెపాసిటీ 2,547 మిలియన్లు లీటర్లు. ప్రస్తుతం 20 శాతం నీరు ఉన్నట్లు ట్యాంకు నుంచి నీటిని సరఫరా చేసే ఎఇ ఎన్.చైతన్య తెలిపారు. తాగునీటి అవసరాల కోసం 11 చెరువులు నింపేందుకు 4.5 టిఎంసిల నీటిని సాగర్ కాలువలు ద్వారా ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు నీటిని విడుదల చేశారుజ ప్రస్తుతం 5,500 క్యూసెక్కుల నీటిని సాగర్ నుంచి విడుదల



అడుగంటిన దర్శి సమ్మర్ ట్యాంకు

చేసినట్లు దర్శి డిఒ అక్బర్‌బాషా తెలిపారు. ఈ నీరు సోమవారం నాటికి దర్శికి చేరనుంది. నీటిని పంపింగ్ చేసేందుకు ఎన్ఎపి అధికారులు మోటార్లను సిద్ధం చేశారు. 200 హెచ్‌పి 2,100 హెచ్‌పి 4,75హెచ్‌పి 3 మోటార్లను పంపింగ్ కోసం సిద్ధం చేసినట్లు ఎన్ఎపి ఎఇ చైతన్య తెలిపారు. ఎన్ఎపి చెరువులో నీటిమట్టం తగ్గిపోవడంతో నీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ నీరు పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా రావడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. దర్శిలోనున్న ఏడు ఫిల్టర్ బెడ్ల ద్వారా నీటిని శుభ్రం చేసి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. అదేవిధంగా దర్శి రాపిడ్ సాండ్ ఫిల్టర్ బెడ్ ద్వారా నీటి శుభ్రం చేసి కొన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. రేపటి సాండ్ ఫిల్టర్ బెడ్ ద్వారా ముండ్లమూరు మండలంలోని 42 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. క్లీనింగ్‌లో బ్లీచింగ్ కలిపి నీరు సరఫరా చేస్తున్నందున నీరు పరిశుభ్రంగా వస్తున్నట్లు అధికారులు తెలిపారు. సాగనీరు వస్తే పంపింగ్ ద్వారా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నింపి నీటిని పరిశుభ్రం చేసి ప్రజలకు సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు.



ఎన్ఎపి చెరువు వద్ద ఉన్న ఏడు ఫిల్టర్ బెడ్లు



రాపిడ్ శాండఫిల్టర్ బెడ్

ఐదో రోజుకు చేరిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి ఆర్‌టిసి డిపో అధికారులు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక, కక్ష సాధింపు చర్యలకు నిరసనగా ఎంప్లాయీస్ యూనియన్ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరాయి. శుక్రవారం నాటి దీక్షలకు కె. వెంకట్రావు అధ్యక్షత వహించారు. కండెక్టర్ యు.నరసింహారావు డ్రైవర్ వైజసాంబశివరావు నాయకులు రమాదేవి, కెవి.రావు ఈ దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిపో మేనేజర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులతో చర్చలు జరిపి చార్టులు వరకే



నిరసన తెలుపుతున్న కార్మికులు

తమ పరిధిలో ఉన్నాయని, మిగతా విషయాలను రీజనల్ మేనేజర్ దష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు. చార్టులు వెంటనే వేసి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి కౌన్సిలింగ్ ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అన్ని సమస్యలు పరిష్కారం చేసేంతవరకూ నిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఎక్సెస్ పేరుపై కనిగిరి డిపోకు రిలీవింగ్‌పై పంపిని డ్రైవర్లను వెంటనే మాత డిపో కి తెప్పించి లీవ్ పొజిషన్ కల్పించాలన్నారు.అక్రమ మాస్టర్లు ఇచ్చి సంస్థకు ఆర్థిక నష్టం కల్పిస్తున్న ఎస్‌టిఐపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎఎంటి కార్యాలయంలో హెయిర్ బస్‌లకు సంబంధించిన ఎస్ఆర్‌లు మిస్ అయితే అధికారులు స్పందించలేదన్నారు. ఈ విషయాలను రీజనల్ మేనేజర్ దష్టికి తీసుకెళ్లినా సూపర్‌వైజర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి -హనుమంతునిపాడు

కనిగిరి నుంచి హనుమంతుని పాడు వేములపాడు మీదుగా వయా కంభం వెళ్లే రహదారిని అభివద్ధి చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో కోరారు. ఈ రహదారిలో ప్రతి ఐదు మీటర్లకు ఒక గుంత ఉన్నట్లు తెలిపారు. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలబడుతున్నట్లు తెలిపారు. ఆ నీటిలో వాహనాలు రాకపోకలు సాగించడం గుంతలు మరింత పెద్దవి అవుతున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాల నుంచి ఈ రోడ్డును అభివద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. కనిగిరి నుంచి కంభం, గిద్దలూరు, మార్కాపురం, కర్నూలు, తాడిపత్రి తదితర ప్రాంతాలకు నిరంతరం వాహనాలు రద్దీగా తిరుగుతుంటాయని అన్నారు. కనిగిరి పరిధిలోని శంఖవరం నుంచి నుండి గ్రానైట్ వాహనాలు అధిక బరువుతో రాకపోకలు సాగిస్తునన్నట్లు తెలిపారు. దీంతో రహదారి గుంతల మయంగా మారినట్లు తెలిపారు. పాలకులు కనీసం గుంతల్లో మట్టి వేసి



గుంటల మయంగా మారిన రహదారి

పూడ్చిన పాపాన కూడా పోలేదన్నారు. గతంలో ఎన్నికైన ఎమ్మెల్యేలు ఈ ప్రాంత అభివద్ధికి సహకరించిన పాపాన పోలేదన్నారు .ఓట్లు వేయించుకోవడం తప్ప ప్రజల సమస్యల గురించి పట్టించుకున్న పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి రహదారి అభివద్ధికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టి వాహన చోదకులను ప్రమాదాల నుంచి కాపాడాలని ఆయన కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి : గఫార్

ప్రజాశక్తి -కనిగిరి

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం అందించాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. కనిగిరి పట్టణంలోని 11వ వార్డులో నున్న ప్రభుత్వ పాఠశాలను మున్సిపల్ చైర్మన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గఫార్ విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం పథకం మెనూ ప్రకారంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించి ఉపాధ్యాయులపై ఆగ్రహ వ్యక్తం చేశారు. పాఠశాలలోని ఆవరణం అపరిశుభ్రంగా ఉంటే విద్యార్థులు సీజనల్ వ్యాధులు బారిన పడే అవకాశం ఉందన్నారెఉ. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించ కుంటే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ప్రభుత్వాలు విద్యాభివద్ధి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న గఫార్

కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ విద్యాభివద్ధికి కషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాల కంటే వసతుల్లో మరియు విద్యలో ప్రథమంగా ఉండటం గర్వకారణమన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి పథకం కూడా ప్రతి విద్యార్థికి చేరే విధంగా చూడాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సరోజకు నివాళులర్పిస్తున్న నాయకులు

సరోజకు ఘన నివాళి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం దాసరపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మికురాలు కలుకూరి సరోజ అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు శుక్రవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సరోజ గతంలో ఉపాధి మేట్‌గా పనిచేసినట్లు తెలిపారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. గుండె ఆపరేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. సరోజ భర్త నారాయణ రోజువారి కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపారు వారి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. ప్రమాద బీమా నిధి మంజూరు చేయాలని కోరారు. మృతురాలి ఇద్దరు పిల్లలకు ఉచిత విద్యను అందించాలని కోరారు. నివాళులర్పించిన వారిలో సుధాకర్, లక్ష్మీనారాయణ, దమ్ము చెన్నకేశవులు, రోశయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పొదిలి

అమత కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక సన్ షైన్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమత హాస్పిటల్ ఎమ్‌డి వరికూటి భరత్, డాక్టర్ రవీంద్రనాథ్, సన్ షైన్ పాఠశాల ఉపాధ్యాయులు, అమత కంటి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-శింగరాయకొండ

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దామచర్ల సత్యకు పదవి రావాలని కోరుతూ నేతాజీ ఆటో యూనియన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ జిల్లాని, వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్, ట్రెజరీ ప్రసాద్, కార్యదర్శి మాధవ, నబి, పవన్, రమేష్, విజయ్, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

నోట్ పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-సిఎస్.పురం

విద్యాభివద్ధికి గ్రామస్తులు అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని మండల పరిధిలోని ఆర్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రామకష్ణ తెలిపారు. గ్రామ పెద్ద చల్లా పెద్ద మాల్యాద్రి కుమారులు మనోజ్, మధు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవాకరం నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాకు చెంగలయ్య, కడప శ్రీను, గోవిందమ్మ, కాకు సుబ్బారావు, నాలి రామ్మోహన్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు గూడల హరిబాబు, జె.ఐశ్వర్య, టి.హెప్సీబా, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహనిర్మాణదారులకు అందని బిల్లులు

అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణాలు
లబ్ధిదారుల ఎదురుచూపులు


బిల్లులు రాక మధ్యలోనే నిలిచిపోయిన ఇంటి నిర్మాణం


నిర్మాణం పూర్తయినా బిల్లులు రాని ఇల్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసీపీ ప్రభుత్వం గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు బిల్లులు ఇవ్వకుండా మొండి చేయి చూపింది. ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది సగం వరకు నిర్మించుకున్న ఇల్లు పూర్తి చేయడానికి అప్పులు కూడా చేశారు. పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ ఇళ్లకు బిల్లులు చెల్లిస్తుందని ఆశతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండలంలో 955, త్రిపురాంతకం మండలంలో 792, పుల్లలచెరువు మండలంలో 901, పెద్దారవీడు మండలంలో 481, పెద్దదోర్నాల మండలంలో 640 చొప్పున మొత్తం 3769 పక్కా గృహాలలో కొన్ని పూర్తవగా, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. అసంపూర్తి గృహాలు గ్రామాల్లో దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఒక్కొక్క ఇంటికి రూ.1.50 లక్షలు చొప్పున చెల్లించాలని నిర్ణయించారు. దీంతో కొందరు నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేయగా మరి కొందరు పునాదులు, శ్లాబ్ స్థాయి వరకు పనులు చేసి విడిచిపెట్టారు. నిర్మాణాలు ప్రారంభించిన కొందరికి రూ.1 చొప్పున ఖాతాల్లో జమ కావడంతో మిగతా మొత్తాలు కూడా అందుతాయని భావించినప్పటికీ నేటికీ నిరాశే మిగిలింది.

టిడిపి హయాంలో 2014 నుంచి 2019 మధ్య కాలంలో ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం బోర్డులు ఏర్పాటు చేయగా తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ బోర్డుల స్థానంలో వైఎస్ఆర్ గృహ నిర్మాణ పథకం బోర్డులను ఏర్పాటు చేయించింది. బోర్డులు మారాయే తప్ప బిల్లులు మాత్రం చెల్లించకపోవడంతో లబ్ధిదారులకు ఎదురుచూపులే మిగిలాయి. ఐదేళ్ల నుంచి పక్కా గృహాల కోసం చేసిన అప్పులు రెట్టింపు అయ్యాయి. బిల్లులు మాత్రం రాలేదంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. నూతన ప్రభుత్వం అయినా నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం

2016-17 నుంచి నియోజకవర్గానికి పలు విడతల్లో పక్కా గృహాలు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు ప్రారంభించిన కొన్ని ఇళ్లకు కొంత మొత్తాలను ప్రభుత్వం జమ చేసింది. మిగతా బిల్లులు జమ కాలేదు. కొంత మంది లబ్ధిదారులకు రూ.1 మాత్రమే జమ చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కలిపి 3769 పక్కా గృహాలకు సంబంధించిన బిల్లులు రావాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

- ఎవివి సురేష్ బాబు, హౌసింగ్ డిఈఈ, యర్రగొండపాలెం

డబ్బులు చాలక మధ్యలోనే నిలిపివేశాం



గత టిడిపి ప్రభుత్వ హయాంలో పక్కా గృహం మంజూరు చేశారు. దీంతో సంబరపడ్డాం. రూ.5 లక్షలు వరకు అప్పులు చేసి నిర్మాణ పనులు చేపట్టాం. శ్లాబ్ వరకు పనులు పూర్తి చేశాం. అంతలో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం వచ్చింది. ఐదు సంవత్సరాలు జరిగినా బిల్లు చెల్లించలేదు. ఖాతాలో రూ.1 మాత్రమే జమచేశారు. మిగతా పనులు చేపట్టడానికి డబ్బులు లేకపోవడంతో అలాగే విడిచిపెట్టాం. అధికారులు వచ్చి పరిశీలించి బోర్డులు మార్చారే తప్ప బిల్లులు చెల్లించలేదు.

- పాలువాయి శకుంతల, వేగినాటి కోటయ్య నగర్

అప్పులు రెట్టింపు అయ్యాయి



గత టిడిపి ప్రభుత్వ హయాంలో పక్కా గృహం మంజూరైంది. వెనువెంటనే బిల్లులు వస్తాయని అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నాం. శ్లాబు కూడా వేశాం. బేస్‌మట్టం బిల్లు మాత్రమే వచ్చింది. మిగతా బిల్లులు రాలేదు. ఇంటి నిర్మాణానికి రూ. మూడు లక్షలు ఖర్చు చేశాం. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వడ్డీలతో రూ. మూడు లక్షలు కాస్తా రూ. ఆరు లక్షలు అయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం అయినా బిల్లులు మంజూరు చేయకపోతే ఇల్లు అమ్మి అప్పులు కట్టాల్సి వస్తుంది.

- తాటి నాగేశ్వరరావు, మిల్లంపల్లి


పల్లా శ్రీనివాసరావుతో టిడిపి నేత మస్తానయ్య

టీడీపీ అధ్యక్షుడు 'పల్లా'ను కలిసిన మస్తానయ్య

ప్రజాశక్తి-మార్కాపురం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మార్కాపురం పట్టణానికి చెందిన టిడిపి నేత దూదేకుల మస్తానయ్య శుక్రవారం కలిశారు. ఇటీవల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును ఈ సందర్భంగా ఆయన సత్కరించారు. మార్కాపురం అభివృద్ధికి మీ వంతు సహకారం అందించాలని మస్తాన్ కోరారు. ఈ కార్యక్రమంలో దూదేకుల గురవయ్య, గంజి వెంకటేశ్వరరెడ్డి, దూదేకుల పేరయ్య, డి.మస్తాన్, డి.కాసిం, అల్లూరయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డిఎం రమేష్

బ్యాంకర్ల కమిటీ సమావేశం

ప్రజాశక్తి-మార్కాపురం

జాయింట్ మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం మార్కాపురం ఎంపిడివో కార్యాలయంలో ఎల్‌డిఎం రమేష్, డిపిఎం సుబ్బారావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డిఎం రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, రుణాల లభ్యత గురించి వివరించారు. ఎస్‌హెచ్‌జిలకు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. మార్కాపురం మండలంలో రూ.1 నుండి 5 లక్షల వరకు రుణాలు 225 మందికి ఇవ్వాల్సి ఉండగా 5 లక్షల రుణాలు 25 ఇవ్వాలని డిపిఎం సుబ్బారావు బ్యాంకర్లకు సూచించారు. ఎస్‌హెచ్‌జి గ్రూపులకు అవగాహన కల్పిస్తామని ఎపిడిఓ చందన తెలియజేశారు. వ్యాపారవేత్తలుగా మారడానికి సిద్ధంగా ఉన్న మరియు కుట్టు, ఎంబ్రాయిడరీ వంటి ఏవైనా కోర్సులు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్న మహిళలు సంప్రదించాలని కోరారు. వారికి శిక్షణ ఇచ్చిన అనంతరం బ్యాంకర్ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - గిద్దలూరు

పట్టణానికి చెందిన ఫాతిమా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు నంద్యాల ఖాసిం వలి పేద విద్యార్థుల చదువు కోసం రూ.50,000 ఆర్థిక సాయం అందజేశారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం యడ్లపల్లి గ్రామానికి చెందిన హుస్సేన్ బీ, ఇస్మాయిల్‌లు కొద్దిరోజుల క్రితం వారి తండ్రిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లి షేక్ రసూల్ బీ కూడా కూలి పనులకు వెళితేనే ఇల్లు గడుస్తుంది. ఇస్మాయిల్, హుస్సేన్‌బి చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా, విషయాన్ని తెలుసుకున్న ఫాతిమా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు నంద్యాల ఖాసిం వలి వారి చదువుల కోసం రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. శుక్రవారం ఈ మేరకు ఫోన్‌పే ద్వారా వారి అకౌంట్‌కి నగదు బదిలీ చేశారు. ఇస్మాయిల్ ఇంటర్ ఫస్టియర్ చదువుతుండగా, హుస్సేన్‌బి బీఫార్మసీ చేస్తోంది. భవిష్యత్తులో కూడా వీరికి అండగా ఉంటామని నంద్యాల ఖాసిం వలి తెలిపారు. పిల్లల చదువుకు ఆర్థిక సహకారాన్ని అందించిన ఫాతిమా స్వచ్ఛంద సంస్థకు షేక్ రసూల్ బీ ధన్యవాదాలు తెలిపారు.

పేదల ఆకలి తీర్చడానికే అన్నా క్యాంటీన్లు

ప్రజాశక్తి - గిద్దలూరు


అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి

ప్రతి పేదవాడి ఆకలి తీర్చడానికే అన్న క్యాంటీన్లను టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అన్న క్యాంటీన్ భవనాన్ని ఆయన పరిశీలించి భవనానికి అవసరమైన మరమతులు చేయించారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్ పునఃప్రారంభం కానున్న సందర్భంగా ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా అన్న క్యాంటీన్లు తెలుగు దేశం పార్టీ స్థాపిస్తే వాటిని గత ప్రభుత్వం మూసివేయడం దారుణమని అన్నారు. మరల పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా అన్న క్యాంటీన్లు తెరవడానికి నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలుగుళ్ల చిన్న శ్రీనివాసరెడ్డి, తాటగిరి ప్రభాకర్ రావు, శివపురం మురళి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



నేతలకు తలనొప్పిగా రేషన్ షాపుల వ్యవహారం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండలంలో రేషన్ షాపుల వ్యవహారం నాయకులకు తల నొప్పిగా మారింది. మాకు కావాలంటే మాకు కావాలంటూ చోటా నాయకులు బడా నాయకుల వద్దకు క్యూ కడుతున్నారు. ఎన్నో ఏళ్ల నుండి పార్టీని కనిపెట్టుకొని, పార్టీ కోసం పని చేశామంటూ కొందరు నాయకులు రేషన్ డీలర్ షిప్‌ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీని గెలిపించుకునేందుకే మేం పార్టీ మారామని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో పార్టీ మారిన నాయకులు సైతం రేషన్ షాపుల కోసం వారి పంథాలో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తానికి పుల్లలచెరువు మండలంలో ఉన్న రేషన్ షాపుల వ్యవహారం టిడిపి నాయకులకు తలనొప్పిగా మారింది.

సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గిద్దలూరు



అవగాహనా కల్పిస్తున్న డాక్టర్ సుమయ

డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తత వ్యవహరించాలని సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ అన్నారు. డెంగ్యూ మాసోత్సవాలలో భాగంగా పట్టణంలోని ప్రజలకు పలుచోట్ల అవగాహన కల్పించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాచిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు రాకుండా దోమతెరలు వాడాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతాయని ఈ దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ రంగనాయకులు, సూపర్ వైజర్ సుధారాణి, ఏఎన్ఎంలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలన సర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి - కొమరోలు

కొమరోలు మండలంలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెల 2వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని కొమరోలు ప్రాథమిక కేంద్ర వైద్యాధికారి చైతన్య దీపక్ తెలిపారు. రోగులను పరిశీలించి కుష్టు వ్యాధికి సంబంధించిన మచ్చలు, బుడిపెలు గుర్తించి నమోదు చేస్తారని ఆయన తెలిపారు. కావున సిబ్బంది ఇంటికి వచ్చిన సమయంలో సహకరించాలని ఆయన కోరారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న షహనాజ్

విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు కబాడీపాలెం చెందిన సుసన్న తండ్రి అనారోగ్యంతో మృతిచెందాడు. తల్లి, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. నారాయణ జూనియర్ కాలేజీలో సుసన్న ఇంటర్ సెకండియర్ చదువుతోంది. కాలేజీ ఫీజు మరియు పుస్తకాలు కొనే ఆర్థిక స్తోమత లేకపోవడంతో సూర్యశ్రీ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్‌బాషా స్పందించి దాత సహకారంతో కాలేజీ ఫీజు పుస్తకాల నిమిత్తం రూ.20 వేలను ట్రస్టు కార్యాలయంలో ట్రస్ట్ చైర్‌పర్సన్ సయ్యద్ షహనాజ్ ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, చిక్కాల కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆదిలక్ష్మి

గ్రంథాలయంలో అకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్యతో కలిసి స్థానిక జడ్పీహెచ్ స్కూల్‌లో గ్రంథాలయ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య మాట్లాడుతూ దాతల సహకారంతో విద్యార్థులు పది మందిని సభ్యత్వం చేర్పించామన్నారు. విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని, కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థీ గ్రంథాలయానికి ప్రతిరోజూ వచ్చి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకారెడ్డి, ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25 వరకు అడ్మిషన్లకు గడువు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఈ నెల 25వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ సావిత్రి శుక్రవారం తెలిపారు. బిఏ (పొలిటికల్ సైన్స్), బికాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బియస్సీ (కంప్యూటర్ సైన్స్), బియస్సి (బోటనీ, హార్టికల్చర్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గత సంవత్సరం జరిగిన యూనివర్శిటీ ఫలితాలలో కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డు సాధించిన అధ్యాపకులు భోధిస్తున్నారని చెప్పారు.

ప్రజాప్రతినిధులు కాకుండా..

సమావేశాల్లో ఎలా పాల్గొంటారు.?

జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రజాప్రతినిధులకు దక్కాల్సిన గౌరవ మర్యాదలు దక్కాలని, సమావేశాల్లో ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశం కూడా ప్రజా ప్రతినిధులకే కల్పించాలని మార్కాపురం జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మార్కాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి బండి లక్ష్మిదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బాపన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు కాని వారిని సభలోకి ఎలా అనుమతి ఇస్తారని ఎంపిడిఓ చందనను నిలదీశారు. అప్పటి వరకు రాయవరం గ్రామ సర్పంచి కె.భాగ్యలక్ష్మి భర్త నడిపి కోటయ్య సమావేశంలో పాల్గొని అధికారులపై ఒకదాని వెంట మరొకటిగా ప్రశ్నలు సంధిస్తూనే ఉన్నారు. అధికారులు కూడా ఆయన ప్రజాప్రతినిధి కాదనే విషయం మరిచిపోయి సమాధానాలు చెబుతూనే ఉన్నారు. దీనిపై జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. ఇకపై ప్రజాప్రతినిధులుగా లేని వారికి సమావేశంలో పాల్గొనకూడదని, ఆ విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అప్పటివరకు మాట్లాడిన రాయవరం గ్రామ సర్పంచి భాగ్యలక్ష్మి భర్త కోటయ్యను బయటకు పంపించారు. వచ్చే సమావేశానికి ప్రజా ప్రతినిధులు మాత్రమే సమావేశానికి హాజరుకావాలని ఎంపిడిఒ తోట చందన కోరారు. గజ్జలకొండ 1వ ఎంపిటిసి రమేష్ మాట్లాడుతూ గజ్జలకొండ ఎస్సీ పాలెంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధిక లోడుతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందన్నారు. అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే గానీ సమస్య తీరదన్నారు. ఎంపిడిఓ చందన మాట్లాడారు గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టబోయే పనులు 'ఈ గ్రామ స్వరాజ్ పోర్టల్' నందు అప్‌లోడ్ చేయుటకు, ఈ ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో ఎంఇఓ బి.రాందాస్ నాయక్, మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డిఆర్‌డిఎ ఏపిఎం రమేష్‌బాబు, ఇఒపిఆర్‌డి రామ్మోహన్‌రెడ్డి, విద్యుత్ శాఖ నుండి సుబ్బరాయుడు, మండలంలోని పలు శాఖల అధికారులు, ఎంపిటిసిలు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ చందన

సంతనూతలపాడులో ఒకరికి డెంగ్యూ

ఆ ఇంటి పరిసరాలను పరిశీలించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండల కేంద్రమైన సంతనూతలపాడులో అంబేద్కర్ నగర్‌కు చెందిన ఒకరికి డెంగ్యూ జ్వరంగా నిర్ధారణైంది. స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన ధర్నాశి మోషే అనే వ్యక్తి గత వారం రోజుల నుండి జ్వరంతో బాధపడుతున్నాడు. సదరు వ్యక్తి ఒంగోలు జిజిహెచ్‌లో అప్రెంటిస్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. వారం నుండి జ్వరం తగ్గకపోవడంతో ఈ నెల 17న రిమ్స్‌లో రక్తపరీక్ష చేయగా డెంగ్యూ జ్వరం అని నిర్ధారణ అయ్యింది. విషయం తెలుసుకున్న డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ సురేష్‌కుమార్ శుక్రవారం డెంగ్యూ జ్వరపీడితుని ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. ఆ ఇంటితో పాటు చుట్టు పక్కల ఉన్న 50 గహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. ఆయన చుట్టుపక్కల గృహాల వారికి పలు సూచనలు చేశారు. డెంగ్యూ జ్వరం సోకిన వ్యక్తి ఆరోగ్యం నిలకడగా ఉందని డిఎంహెచ్ఒ దష్టికి స్థానిక వైద్యసిబ్బంది తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ బి మాధవీలత, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ బి.శ్రీవాణి, స్థానిక వైద్యాధికారి డాక్టర్ పి హరిణి, సిహెచ్ఓ ఆర్.ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

మారెళ్ల కాశీరత్తమ్మ వర్ధంతి సందర్భంగా

నేడు వికలాంగ విద్యార్థులకు ఆర్థిక సాయం..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కీర్తిశేషులు మారెళ్ల కాశీరత్తమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా పేలప్రోలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వికలాంగుల ఉన్నత చదువుల కోసం శనివారం ఆర్థిక సహకారం అందించనున్నట్లు ఆమె కుమారులు మారెళ్ల వివేకానంద, సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇండియన్ మెడికల్ హాలులో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కాశీరత్తమ్మకు సంబంధించిన ప్రత్యేక గీతం ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. మారెళ్ల వెంకటేశ్వర్లు, కాశీరత్తమ్మ సేవాపురస్కారాలు కూడా ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంతపేటలోని శివం ఫౌండేషన్‌లో భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు.

పనుకుమడుగు తాండాలో అన్నదానం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని పనుకుమడుగు తాండాలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేసి వంద మంది గిరిజన మహిళలకు, పురుషులకు, చిన్నారులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ఎక్స్‌ఆర్డినరి కెప్టెన్ రాముడు, లాయర్ శ్రీనివాస చౌదరి, రమేష్‌రెడ్డి, నాగ భూషణం, వెంటయ్య, మణికంఠ, అనుమాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కవితా మంజూష గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కవితా మంజూష గ్రంథ ఆవిష్కరణ మహోత్సవం యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కే రమాదేవి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా జరిగింది. గ్రంథ రచయిత దేవులపల్లి విశ్వనాథ్ మాట్లాడుతూ సామాజిక స్పహతో రచనలు చేసి దేశాభివృద్ధికి పాటు పడతారని తెలిపారు. విద్యార్థులు జ్ఞాన సంపన్నులై చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ట్రిబుల్ ఐటీలో ఎంపికైన విద్యార్థినులకు, 6 నుండి 10 వరకు మెరిట్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1,116లు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో గ్రంథ ఆవిష్కరణ కర్త, పూర్వ విద్యార్థి వెంకటస్వామి, ఎంఈఓ ఆంజనేయులు, ఎంఈఓ 2 మల్లు నాయక్, రిటైర్డ్ తెలుగు పండిట్ వెంకటసుబ్బయ్య, రజిని, ఖయ్యూం భాషా, మంత్రునాయక్ పాల్గొన్నారు.

అరుదైన జన్యు వ్యాధితో..

అన్నదమ్ముల నరకయాతన

ఆధునిక వైద్యం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు మండలం పిడికిటివారి పల్లి గ్రామానికి చెందిన పిడికిటి ఆదెయ్య, వెంకటమ్మల ద్వితీయ, తృతీయ కుమారులైన వెంకటేశ్వర్లు, గోవిందయ్యలు స్పైనో సెరిబెల్లర్ అటాక్సియా అనే అరుదైన జన్యు వ్యాధితో బాధపడుతున్నారు. రోజురోజుకూ మృత్యుముఖానికి చేరువవుతున్నారు. అన్నదమ్ములు ఇద్దరికీ 14 సంవత్సరాల వయసులో ఈ వ్యాధి సోకడం గమనార్హం. మేనరికపు వివాహం వల్ల ఈ వ్యాధి సంక్రమించిందని వైద్యులు తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారికి మెదడు, అవయవాల మధ్య నియంత్రణ లోపిస్తుంది. దీని వల్ల నడకలో రోజురోజుకూ సమన్వయం కోల్పోవడం, చేతులు పట్టు కోల్పోవడం, మాటలు తడబడటం జరుగుతుంది. రోజులు గడిచేకొద్దీ ఈ సమస్యలు మరింత తీవ్రమై మంచానికే పరిమితమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం అన్నదమ్ముల ఇద్దరిలో వెంకటేశ్వర్లు మంచానికే పరిమితమయ్యాడు. వీరి పెద్ద సోదరుడు అయిన పెద్ద వెంకటేశ్వర్లుకు కూడా ఈ వ్యాధి సోకే 30 సంవత్సరాల వయసులో మరణిం చాడు. డిగ్రీ, టిటిసి చదివి డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాలనే కాంక్షలు ఉన్న గోవిందయ్య వ్యాధి తీవ్రత పెరగడంతో ఇంటికే పరిమితమయ్యాడు. పలు ఆసుపత్రులకు వెళ్లినా చికిత్స లేదని చెప్పడంతో తీవ్ర నిరాశతో ఇంటికే పరిమితమయ్యాడు. ఈ కుటుంబం ఆధునిక వైద్య చికిత్స సహాయం కోసం ప్రభుత్వాన్ని వేడుకుంటోంది.





గోవిందయ్య, వెంకటేశ్వర్లు

గ్రామగ్రామాన సంఘాన్ని నిర్మిద్దాం

- దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం
- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం



మాట్లాడుతున్న రఘురాం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

గ్రామగ్రామాన కెవిపియస్ సంఘాన్ని నిర్మించడం తోపాటు, దళితుల సమస్యల పరిష్కారానికి అంకితభావం తో కషి చేయాలని కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలు లోని ఎల్బీజీ భవన్ లో కెవిపియస్ జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జవ్వాజి రాజు అధ్యక్షతన జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావులి మాట్లాడారు. సమావేశం ప్రారంభానికి ముందు మాజీ జిల్లా కమిటీ సభ్యుడు గద్దె జడ్సన్, కడప జిల్లా కార్యదర్శి సునీల్ కు నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ లేని పాలకవర్గాలు మన సమస్యలపై దృష్టి పెట్టాలంటే అనగారిన మన సామాజిక తరగతుల్లో ప్రశ్నించే చైతన్యాన్ని పెంచాలన్నారు. సబ్ ప్లాన్ చట్టం ఉన్నా నిధులేమవుతున్నాయో తెలియదని, బతుకు భద్రత కల్పించే అట్రాసిటి చట్టం ప్రకారం అరెస్టయినా స్టేషన్ బెయిలిస్తున్నారని, దళిత వత్తులు నేటికీ అంటరానితనంను భరిస్తూనే బతుకుతున్నాయని, వీటన్నిటికీ పరిష్కారం మరింత ఐక్యత, చైతన్యం, పోరాటమే మార్గమన్నారు. అందుకై పల్లెపల్లెనా కెవిపియస్ సంఘం ఏర్పడాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి రాఘవులు, వి మోజేష్, కాలే మల్లికార్జున్ రావు బక్క జేసురత్నం, జిల్లా కమిటీ సభ్యులు పరదేశి, రాజశేఖర్, కొమ్ము బ్రహ్మయ్య, కొలనీడి నరేష్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి

అధిక ప్రాధాన్యతనివ్వాలి

కలెక్టర్ వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు అధికారులు అధిక ప్రాధాన్యతనిచ్చి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ జె వెంకటమురళి ఆదేశించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం జిల్లాస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటి పురోగతిపై చర్చ జరిగింది. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఏదైనా ఘటన జరగగానే ప్రాథమిక విచారణ చేయాలన్నారు. నిబంధనలను అనుసరించి తక్షణమే చార్జ్‌షీట్ వేయాలన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. వైద్య ధ్రువీకరణ పత్రాల జారీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రస్తుతం 47 కేసులకు నష్టపరిహారం అందించడానికి దస్త్రాలు సిద్ధం చేశామన్నారు. నిధులు విడుదల కాగానే నేరుగా బాధితులకు చేరుతాయన్నారు. అధిక నిధులు కావాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ప్రస్తుతం 83 కేసులు విచారణలో ఉన్నాయన్నారు. భూమి కేటాయింపులు, ఉద్యోగం నియామకాలపై చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసులను సత్వరమే ఎలా పరిష్కరించాలో అధికారులు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. స్మశాన భూములు లేని ఎస్సీ, ఎస్టీ గ్రామాలను గుర్తించాలన్నారు. ఏ గ్రామాలలో ఎంత భూమి అవసరం ఉందో, ఎంత భూమి కావాలనే అంశాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన స్మశానభూమి కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమలులో అడ్డంకులను తొలగించేలా చూస్తామన్నారు. అద్దంకి, గోవాడలో తక్షణమే స్మశాన భూమి కేటాయించాలన్నారు. మాదకద్రవ్యాలు నిరోధించడానికి పోలీసు అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

బాధితులకు భరోసా కల్పించి తక్షణమే సహాయ సహకారాలు అందించేలా చూస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. ఘటనలు జరిగిన ప్రాంతాలకు తక్షణమే పోలీసులు వెళ్లి విచారించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చార్జిషీటు తక్షణమే నమోదు చేస్తామన్నారు. గ్రామాలలో విస్తతంగా పర్యటిస్తామని చెప్పారు. ప్రజలలో సామాజిక చైతన్యం తీసుకువస్తామన్నారు. అట్రాసిటీ కేసులలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు అన్నారు. కేసులలో ఎదురయ్యే సమస్యలన్నీ పరిష్కరిస్తామని వివరించారు. ఈ సమావేశంలో చీరాల శాసనసభ్యులు ఎం ఎం కొండయ్య, జిల్లా కమిటీ కన్వీనర్ రాజాదిబోరా, కమిటీ సభ్యులు కట్టా శ్రీనివాసరావు, పి ప్రసాద్ రావు, టి సురేష్, జి రాజారావు, జి నాగమణి, అనుబంధశాఖల జిల్లా అధికారులు, ఆర్ డి ఓ లు, డిఎస్పీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-చీమకుర్తి, ఒంగోలు సబర్బన్

నాణ్యమైన విద్యాబోధనతోపాటు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా గురుకులం అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చీమకుర్తి మండలంలో విస్తతంగా పర్యటించారు. తొలుత రామతీర్థం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను సందర్శించి, ఇన్ టెక్ వెల్ మరియు పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్‌లో వున్న నీటి లభ్యత, రిజర్వాయర్ నుండి వాటర్ డిస్ట్రిబ్యూషన్ విధానాన్ని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం చీమకుర్తి లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలో వున్న విద్యార్థినుల అడ్మిషన్ వివరాలను, హాజరు రిజిస్టర్స్, వంట సరుకుల నాణ్యత, భోజనం నాణ్యత ను, కిచెన్ లో పరిశుభ్రతను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వండిన ఆహారం పరిమాణం గురించి ప్రిన్సిపాల్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆహారం వండే విధానం, మెనూ ప్రకారం పిల్లలకు అందిస్తున్నారా.? లేదా..? అని కూడా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం డార్మెంటరీను, డైనింగ్ హాల్, హ్యాండ్ వాష్ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. భోజనం నాణ్యతను గురించి కూడా విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట చీమకుర్తి తహశీల్దార్ సురేష్, మునిసిపల్ కమిషనర్ ఈశ్వర్ రాజు తదితరులు వున్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రభుత్వ సేవలు పటిష్టంగా అమలు

జిల్లాలో వివిధ కార్యక్రమాల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ సేవలు పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరెట్ లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ రిజిస్ట్రేషన్, కమర్షియల్ టాక్స్, ట్రెజరీ, ఆడిట్, ఎండోమెంట్స్ శాఖల అధికారులతో సమావేశమై ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. సమావేశంలో రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి పుష్పాలత, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.కరీంభాషా, జిల్లా ట్రెజరీ అధికారి జగన్నాథరావు, స్టేట్ ఆడిట్ ఆర్.డి.డి నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



ఎస్పీకి మొక్క అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు శుక్రవారం ఒంగోలులోని ప్రకాశం భవనంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాను మర్యాద పూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేశారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. అలాగే జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

పోతురాజుకాలువను ఆధునీకరించాలి

ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా మధు విజ్ఞప్తి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పోతురాజుకాలువ ఆధునీకరణ పనులు ప్రణాళికా బద్ధంగా చేపట్టి, నగర ప్రజలకు అన్ని విధాలా ఉపయోగపడేలా చూడాలని ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా మధు ఒక ప్రకటనలో కోరారు. పోతురాజుకాలువ సమస్య పరిష్కారం కోసం నగర ప్రజలు గత 25 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. అయితే గతంలో జరిగిన పనులు ప్రజల ఆశలకు విరుద్ధంగా జరిగాయని పేర్కొన్నారు. రెండు రోజుల కిందట మున్సిపల్ మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పోతురాజుకాలువను సందర్శించడం అభినందనీయమన్నారు. పోతురాజుకాలువ పనులు తిరిగి ప్రారంభమవుతాయని ప్రజల్లో నమ్మకం కుదిరిందన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కోసం, ఒక ప్రణాళిక రూపొందించినప్పుడు అది నాలుగు రకాలుగా ప్రజలకు ఉపయోగపడాలని చెప్పారు. ఇప్పుడు జరిగిన పనుల వల్ల సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం జరగదని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. సమస్యకు 30శాతం మాత్రమే పరిష్కారం దొరుకుతుందన్నారు. సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం జరగాలి అంటే అందుకు అనుగునంగా ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే కాలువ పరివాహక ప్రాంతంలో ఉన్న మురికివాడలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ సారైనా పక్కా ప్లాన్ రూపొందించి పనులు చేపట్టాలని, కాలువ ఆధునీకరణ సందర్భంగా కాలువకు రెండు వైపులా రోడ్లు నిర్మాణం చేయాలని స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌కు విజ్ఞప్తి చేశారు.

వరద వస్తే

సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలి

- అధిక వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాలి..
- లంక గ్రామాల ప్రజలతో కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-కొల్లూరు, బాపట్ల జిల్లా

రానున్న రోజుల్లో అధిక వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. జిల్లాలోని కొల్లూరు మండలం, కష్ణా నది పరివాహక ప్రాంతం, అరవింద వారధి, పెసర్లంక, చిలుమూరులంక, సుగ్గనలంక, పెద్దలంక, చింతర్లంక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ శుక్రవారం విస్తతంగా పర్యటించారు. వర్షాలు అధికమై వరద వస్తే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని కలెక్టర్ జె వెంకట మురళి కోరారు. వరద ప్రమాదానికి గురయ్యే గ్రామాలలో ప్రజలతో మాట్లాడారు. గత అనుభవాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వరద ముంపు, విపత్తు రాకముందే ప్రజలు అప్రమత్తం కావాలని సూచించారు. లంక గ్రామాలలోని ప్రజలంతా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం విపత్తు నిర్వహణపై జిల్లా అధికారులతో కొల్లూరు మండల ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రజల ప్రాణాలు చాలా విలువైనవని, ఎవరికి ఎలాంటి హాని జరగరాదని కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. కష్ణానది లంక గ్రామాలకు ముంపు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక వర్షాలు కురుస్తాయని ప్రకటనతో కష్ణా నది ప్రకాశం బ్యారేజీలోకి వరద నీరు చేరితే దిగువకు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. నీరు అధికమైతే ఆరు లంక గ్రామాలలోని 14 ఆవాస ప్రాంతాలకు నీరు చేరుతాయన్నారు. ప్రస్తుతం 56 బోట్లు, 100 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. ఎన్ డి ఏ సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లంక గ్రామాల వద్ద పడిన గండి పూడ్చడానికి తాత్కాలిక, ప్రణాళిక శాశ్వత ప్రణాళికను రూపొందించి తక్షణమే నివేదిక పంపాలన్నారు. అధిక వర్షాలతో లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ కి 12 అడుగులకు వరద నీరు మించితే నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో మొదటి హెచ్చరికగా భావించి గ్రామస్తులు బయటకు రావడానికి సిద్ధంగా ఉండి అధికారులకు సహకరించాలన్నారు. నీటి ప్రవాహం పెరిగే కొద్దీ లంక గ్రామాలలో విస్తత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. వరద విపత్తు నేపథ్యంలో అనుబంధశాఖల అధికారులంతా అందుబాటులో ఉండాలన్నారు. పునరావాస కేంద్రాలలో మంచి భోజనం ఏర్పాటు చేయడానికి నిత్యవసర సరుకులు, గ్యాస్ సిలిండర్లు ముందుగా నిల్వ చేసుకోవాలన్నారు. అధికారులు అజాగ్రత్తతో ఉండరాదని హెచ్చరించారు. ఎక్కడ ఏ సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, రేపల్లె ఆర్డిఓ హేలా షారోన్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్ విజయమ్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి సురేష్, కొల్లూరు ఎమ్ఆర్వో పుల్లారావు, ఎంపిడివో లక్ష్మీకుమారి పాల్గొన్నారు.